క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వేణుగోపాల్

కృష్ణగిరి: సీజనల్ హాస్టళ్లలో ఉండే పదో తరగతి విద్యార్థులపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–అర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. మండల పరిధిలోని కంబాలపాడు, కోయిలకొండ గ్రామాల్లోని సీజనల్ హాస్టళ్లను సోమవారం రాత్రి ఆయన అలెస్కో శ్రీనివాసులు, సీఎంఓ రాజేశ్వరితో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. మోనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పరీక్షలకు ప్రణాళికతో చదవాలని సూచించారు. సీఆర్పీ వీరనాగప్ప వెంట ఉన్నారు.

16 నుంచి సమ్మె

ఎమ్మిగనూరుటౌన్: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16, 17 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణ పేర్కొన్నా రు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసు మేరకు సీనియర్ తపాలా ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వలేదన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం సభ్యులు నాగరాజుస్వామి, బాలకృష్ణ, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన కన్నడిగులు



ఆలూరు మండలం కురువెళ్ల సమీపంలో పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులు

ఆలూరు రూరల్: ఈ నెల 22వ తేదీన ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జున స్వామివారి ఉత్సవాలు తిలకించి మొక్కుబడులు తీర్చుకునేందుకు కన్నడిగులు పాదయాత్రగా తరలి వెళుతున్నారు. ఎండలు సైతం లెక్క చేయకుండా మహిళలు, పిల్లలు పాదయాత్రగా వెళ్తున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి శ్రీశైలం వెళ్లే రహదారిలో కర్నూలు జిల్లాలోని వివిధ దేవాలయాల వద్ద యాత్రికులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరందరూ ఈ నెల 20వ తేదీలోగా శ్రీశైలానికి చేరుకోనున్నట్లు తెలిపారు.

సెబ్ విస్తృత దాడులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ శ్యాంప్రసాద్

వెల్దుర్తి: మండల పరిధిలోని సిద్దినగట్టు, బోయనపల్లెలో సోమవారం కోడుమూరు సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. వెల్దుర్తి పోలీసులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన దాడులలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారా, కర్ణాటక మద్యం 62 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు గ్రామాలకు చెందిన నిందితులు ఐదుగురిని అరెస్ట్ చేసి డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సెబ్ సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గురజాల వాసి మృతి



రామాంజనేయులు (ఫైల్)

నందవరం: రోడ్డు ప్రమాదంలో గురజాల గ్రామానికి చెందిన కురువ రామాంజినేయులు(36) మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఎరిగెర గ్రామ సమీపంలో మోటారు సైకిల్ కింద పడి రామాంజినేయులు, మామ జయరాముడు గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడ్డ రామాంజినేయులు రాయచూరు ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. సోమవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఎరిగెర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు శివశంకర్, జగన్ ఉన్నారు. రామాంజినేయులు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు విలపించారు.

ఆలయ ప్రారంభోత్సవం

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన కొట్రు బసవేశ్వరస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో వీరశైవ లింగాయుతులు, గ్రామస్తులు చందాలు వేసుకుని నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. సోమవారం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా భక్తులకు అన్నదానం చేపట్టారు.



కృష్ణగిరిలో ఓటు వేసేందుకు బారులుతీరిన పట్టభద్రులు



మద్దికెరలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ నాగబాబు

పకడ్బందీగా పోలింగ్

- పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో పట్టభద్ర ఓటర్ల పోలింగ్ 73 శాతం
- ఉపాధ్యాయ ఓటర్ల పోలింగ్ 94.18 శాతం



తుగ్గలిలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్ర ఓటర్ల పోలింగ్ 73 శాతం, ఉపాధ్యాయ ఓటర్ల పోలింగ్ 94.18 శాతం, స్థానిక సంస్థల ఓటర్ల పోలింగ్ 96.52 శాతం నమోదైనట్లు ఆర్‌డీఓ మోహన్‌దాసు తెలిపారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల పట్టభద్రుల పోలింగ్ కోసం 10 కేంద్రాలు, ఉపాధ్యాయుల పోలింగ్ కోసం 9 కేంద్రాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం పత్తికొండ ఆర్‌డీఓ కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో 9,385 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా 6,851 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 430 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 405 మంది ఓటు వేశారు.

పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టభద్ర ఓటర్ల కోసం 2 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్ల కోసం 1 పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. పట్టభద్ర ఓటర్లు 2,192 మందికిగాను 1,574 మంది (71.80 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 222 మంది ఉండగా 213 మంది (95.95శాతం) ఓటు వేశారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 144 మందికిగాను 139 మంది ఓటు వేశారు.

ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పోలింగ్ సరళి గురించి తెలుసుకున్నారు. పత్తికొండ, మద్దికెరలోని పోలింగ్ కేంద్రాలను ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు పరిశీలించారు. డీఎస్పీలు వెంకట్రామయ్య, శ్రీనివాసులు, సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు పోలీసుసిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కృష్ణగిరి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును ఉపయోగించుకున్నారు. పట్టభద్రులకు సంబంధించి 829 ఓటర్లకు గాను 627 ఓట్లు పోలై 75.63 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 9ఓట్లకు గాను 8ఓట్లు పోలై 88.88 శాతం నమోదైనట్లు తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు.

మద్దికెర: మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 76.71 శాతం మంది పట్టభద్రులు, 89 శాతం మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 756 మంది ఉండగా పురుషులు 448, మహిళలు 132 మంది మొత్తం 580 మంది, ఉపాధ్యాయులు పురుషులు 31 మంది, మహిళలు 12 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ నాగబాబు పరిశీలించారు.

తుగ్గలి: మండలంలో మొత్తం 1350 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. అందులో 980 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా వారిలో పురుషులు 797 మంది, మహిళలు 183 మంది ఓటు వేశారు. మొత్తం 72.59 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 25 ఓట్లు ఉండగా 23 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 92 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ రవి తెలిపారు. మిగిలిన రెండు ఓట్లలో ఒకటి డబుల్ ఎంట్రీ కాగా మరొక ఓటు షిఫ్టు అయినట్లు ఆయన తెలిపారు. ఏఎస్పీ నాగరాజు ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కేంద్రాన్ని పోలింగ్ సరళిని పరిశీలించారు.



దివ్యాంగ ఓటరు గౌస్‌పీరాను పోలింగ్ కేంద్రంలోకి మోసుకొస్తున్న వీఆర్వో నారాయణ

వెల్దుర్తి: మండల కేంద్రంలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పట్టభద్రుల ఓటర్లు 1,258 మంది ఉండగా 957 మంది (76.01 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్లు 21 మందికిగాను 18 మంది ఓటు వేశారు. పట్టభద్రులు బారులు తీరడంతో నిర్వాహకులు వేసిన టెంట్ నిండిపోయింది. ఎండలో క్యూకట్టిన ఓటర్లు అసౌకర్యానికి గురయ్యారు. నిర్వాహకులు మరో మూడు షామియానాలు ఏర్పాటు చేశారు. దాదాపు 3 గంటల పాటు క్యూలో నిలిచిన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు బారులు తీరడంతో సీఐ యుగంధర్, ఏఈఆర్‌ఓలు గేటు మూసివేసి లోపల ఉన్న ఓటర్లకు టోకెన్లు జారీ చేసి ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించా రు. ఏఈఆర్‌ఓ, సీఐ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, రెవి న్యూ, పోలీసు సిబ్బంది కృషిపై ఓటర్ల ప్రశంసలు వినిపించాయి. ఉలిందకొండ పీహెచ్‌సీ, స్థానిక సచివాలయ సిబ్బంది ఓటర్లకు ఆరోగ్య సేవలందించారు.



ఆదోని ఆర్డీఓ కార్యాలయ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



గోనెగండ్లలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు



ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ స్కూల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహన్ బేగం, తహసీల్దార్ జయన్న

బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

- ఓటేసేందుకు పోటెత్తిన ఉపాధ్యాయులు, పట్టభద్రులు
- సాయంత్రం 6.30 వరకు కొనసాగిన ఓటింగ్

ఎమ్మిగనూరు/ఎమ్మిగనూరు రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పట్టభద్రులు 8000 మంది, ఉపాధ్యాయులు 667 మంది ఓటు నమోదు చేసుకొన్నారు. పట్టభద్రులకు ఎమ్మిగనూరు పట్టణంలో 5, గోనెగండ్ల మండలంలో 2, నందవరంలో 1 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఓటర్లకుగాను ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్లలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో పట్టభద్రులు 73.39 శాతం, ఉపాధ్యాయులు 92.33 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు

సోమవారం ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యింది. పట్టభద్రుల స్థానం కోసం మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలింగ్ ఏజెంట్ ఫారాల కోసం టీడీపీ కార్యకర్తలు, ఎన్నికల అధికారుల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ జయన్న సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగి పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు బూతులలో సాయంత్రం 6.30 గంటల వరకు పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు. వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులకు ఒకటి, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఓటుహక్కును వినియోగించుకొనేందుకు పట్టభద్రులు బారులు తీరారు. ఉపాధ్యాయుల ఓటింగ్ నింపాదిగా మొదలై తరువాత జోరందుకొంది. పట్టణంలో 601 మందికిగాను 554 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. గోనెగండ్లలో 46 మందికిగాను 43 మంది ఉపాధ్యాయులు, నందవరంలో 22 మందికిగాను 22 మంది ఉపాధ్యాయులు ఓటు వేశారు. పట్టణంలో 5,433 మంది ఓటర్లకుగాను 3,958 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందవరంలో 1,060 మందికిగాను 884 మంది పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. డిప్యూటీ కలెక్టర్ రమాకాంత్‌రెడ్డి, ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. సీఐలు మధుసూధన్, మోహన్‌రెడ్డి, మంజునాథ్ నేతృత్వంలో పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు .



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ కలెక్టర్ రమాకాంతరెడ్డి

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులకు 2, ఉపాధ్యాయులకు 1 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టభద్రులకు సంబంధించి 80.54 శాతం, ఉపాధ్యాయ ఎన్నికల్లో 93.48 శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రులు 1516 మందికిగాను 1221 మంది, ఉపాధ్యాయులు 46 మందికి గాను 43 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని ప్రొహిబిషన్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్, సీఐ మోహన్ రెడ్డి పరిశీలించారు.



ఎమ్మిగనూరులో ఓటు వేసేందుకు వీల్‌ఛైర్‌లో వచ్చిన పట్టభద్రురాలు ప్రసన్నలక్ష్మీ

సినిమా చూపిస్తున్నారు

- ప్రేక్షకుల జేబుకు క'త్తెర'
- తినుబండారాల విక్రయం ద్వారా దోపిడీ
- పార్కింగ్‌కు అ'ధనం'

ఎమ్మిగనూరు: పట్టణంలోని పాత సినిమా థియేటర్లు మల్టిప్లెక్స్‌లుగా రూపుదిద్దుకుంటున్నాయి. కొత్తగా థియేటర్లు తయారవడంతో పాటు రేట్లను కొత్త కొత్తగా నిర్ధారించారు. స్నాక్స్, వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్స్ బ్రాండెడ్ పేరుతో అదనందా వసూలు చేస్తున్నారు. పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ అయితే టికెట్లతో పాటు కాంబో ప్యాక్ అంటూ అదనపు బాదుడుకు తెరతీస్తున్నారు. కాస్త కాలక్షేపం కోసం సినిమాకి వెళ్దామంటే టిక్కెట్లు ప్రియంగా మారాయి. థియేటర్‌లోకి వెళ్లక ముందే మల్టిప్లెక్స్‌లు ప్రేక్షకులకు మరో రకంగా సినిమా చూపిస్తున్నాయని సగటు ప్రేక్షకుడు ఆందోళన చెందుతున్నాడు. పెద్ద హీరో సినిమాకు టికెట్లతో పాటు కాంబో ప్యాక్, ఆర్డినరీ ప్యాక్ కొనుగోలు తప్పనిసరి చేస్తున్నాయి. అప్పటికే చేతి చమురు వదిలించుకున్నప్పటికీ విశ్రాంతి సమయంలో అసలు సినిమా మొదలవుతుంది. నలుగురు కలిసి సినిమాకు వెళితే స్నాక్స్‌కే రూ.400 నుంచి రూ.600 వరకు వెచ్చించాల్సి వస్తోంది. టిక్కెట్ ధరలకే చుక్కలు కనిపిస్తుంటే స్నాక్స్ ధరలు అమాంతం పెంచేశారు. పార్కింగ్ పేరుతో అదనపు దోపిడీ. టూవీలర్ అయితే రూ.15, కారు అయితే రూ.30 ముక్కు పిండి వసూలు చేయడమే. ఫలితంగా గత్యంతరం లేక సినిమాకు వచ్చామంటూ సగటు ప్రేక్షకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



పట్టణంలోని ఓ సినీ కాంప్లెక్స్

కాంబో పాక్‌ల పేరిట వసూళ్లు

పెద్ద హీరో సినిమా విడుదలైతే మాత్రం అభిమానుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మల్టిప్లెక్స్ థియేటర్‌లోనే అభిమాన హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. థియేటర్ల నిర్వాహకులు సినిమా రిలీజయిన వారం రోజుల పాటు టికెట్‌తో పాటు కాంబో ప్యాక్ తప్పనిసరి చేస్తున్నారు. కేవలం పాప్‌కార్న్, కూల్ డ్రింక్ బాటిల్ చేతిలో పెట్టి రూ.300 వసూలు చేస్తున్నారు. సినిమా టికెట్ ధర రూ.200 ఉండగా అదనంగా స్నాక్స్ కోసం రూ.100 వసూలు చేస్తున్నారు.



స్కూటర్ పార్కింగ్ రసీదు

ధరలు ఇలా..

తినబండారం	థియేటర్‌లో (రూ.)	బయట మార్కెట్‌లో (రూ.)
పాప్‌కార్న్	30	10
కోల్డ్ కాఫీ	30	15
కేక్	25	15
సమోసా (2)	30	10
దిల్‌పసంద్	50	20
ఫింగర్ చిప్స్	50	20

ఫిర్యాదు చేస్తే చర్యలు

సినిమా థియేటర్ యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి. వినోద చట్టం ఉల్లఘించినా, ప్రేక్షకు లు ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకుంటాం.
– జయన్న, తహసీల్దార్

స్నాక్స్ పేరుతో దోపిడీ

గతంలో చెక్కీలు, వేరుశనగ విత్తనాలు, పాప్‌కార్న్, కూల్ డ్రింక్స్ తీసుకొని సినిమాల్లోకి వచ్చి విక్రయించేవారు. అయితే ప్రస్తుతం ప్రేక్షకుడే వాటి వద్దకు వెళ్లి తీసుకున్నా, నిర్వాహకులే ఆర్డర్‌పై ఇచ్చినా వాటి రుచి సంగతేమో కాని ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. థియేటర్ వెలుపల కొనుగోలు చేసినా తినుబండారాలను లోనికి అనుమతించడం లేదు. థియేటర్ క్యాంటీన్‌లోనే కొనుగోలు చేయాలి. ప్రతి స్నాక్స్‌పై జీఎస్టీ బాదుడు అదనమే. – జనార్దన్, టీచర్

కట్టుదిట్టంగా ఏర్పాట్లు



ఆలూరు పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన పట్టభద్ర ఓటర్లు

ఆలూరు: ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. వలస ప్రాంతాలకు చెందిన పట్టభద్రులతో ఓట్లు వేయిస్తున్నారంటూ ఆస్పరి, ఆలూరులో పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని నిలువరించారు. ఆలూరు జెడ్పీ హైస్కూలు కేంద్రంలో 1,088 మందికి గాను 805 మంది పట్టభద్రులు (74.62 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 45 మందికిగాను 44 మంది (97.77 శాతం) ఓటు వేశారు. చిప్పగిరి మండలంలో 500 మంది పట్టభద్రులకుగాను 372 ఓట్లు (74.40 శాతం) పోలయ్యాయి. 12 మంది ఉపాధ్యాయులకు గాను 11 మంది ఓటు వేశారు. ఆస్పరి మండలంలో 1,124 మంది పట్టభద్రులకు గాను 683 మంది (60.65 శాతం) ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఓటు వేశారు. ఉపాధ్యాయులకు 20 మందికిగాను 19 మంది ఓటు వేశారు. హాలహర్వి మండలంలో టీచర్స్ ఓటర్లు ఇద్దరు మాత్రమే నమోదై ఉండడంతో వారిద్దరూ ఉదయం 9.30 గంటలకే ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 294 మంది ఓటర్లు ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట లోపు 259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ 88 శాతం నమోదైంది. పత్తికొండ డివిజన్ ఎన్నికల అబ్జర్వర్ వంశీ కృష్ణ పోలింగ్ సరళిని పరిశీలించారు. హొళగుందలో 528 మంది పట్టభద్రులకుగాను 431 ఓట్లు పోలయ్యాయి. 81.6 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే మొత్తం ఆరుగురు ఉపాధ్యాయులు ఓట్లు వేశారు. దేవనకొండ మండలంలో 1244 మందికిగాను 891 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 72 శాతం పోలింగ్ నమోదైంది. 46 మంది ఉపాధ్యాయులకుగాను 42 మంది (72 శాతం) ఓటు వేశారు.



ఆస్పరిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాస్



బ్యాలెట్ బాక్సుకు సీల్ వేస్తున్న అధికారులు

మూడు గడ్డివాములు దగ్ధం



హులేబీడులో దగ్ధమవుతున్న గడ్డివాము

చిప్పగిరి: ప్రమాదవశాత్తు 3 గడ్డివాములకు నిప్పంటుకుని దగ్ధం కావడంతో రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన చిప్పగిరిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే.. చిప్పగిరికి చెందిన హరిజన మనోహర్, హరిజన బాలు పశుగ్రాసం కోసం కల్లందొడ్డిలో గడ్డివాములు వేసుకున్నారు. సోమవారం గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈలోపు గడ్డివాములు మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. తహసీల్దారు లక్ష్మినారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నష్టం అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. వీఆర్‌ఓ తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

హులేబీడులో..

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైంది. ఆ గ్రామానికి చెందిన రైతు అంజినప్ప ఎద్దుల కోసం కొని తెచ్చుకున్న రూ.75 వేల విలువ చేసే పశుగ్రాసం కాలి బూడిదైంది. అంజినప్ప ఇటీవలే రెండు ట్రాక్టర్ల వరిగడ్డి, ఒక ట్రాక్టర్ వేరుశనగ గ్రాసాన్ని రూ.75 వేలు వెచ్చించి కొనుగోలు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం నిప్పంటుకోవడంతో ఫైర్ అధికారులకు కాల్ చేయగా వారు వచ్చి మంటలార్పేలోపు గ్రాసం పూర్తిగా కాలిపోయింది.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

కృష్ణగిరి: ఈ నెల 15న ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చాయి. వీటిని రూట్ అధికారి శంకరయ్య పోలీస్ బందోబస్తుతో తీసుకువచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో జరిగే సెంటర్‌కు సంబంధించి సెట్–1, సెట్–2 పేపర్లు వచ్చాయని ఆయన తెలిపారు. వీటిని సెంటర్ ఛీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులైన విశ్వేశ్వరయ్య, చౌడప్పల సమక్షంలో అప్పగించడం జరిగిందని ఆయన తెలిపారు.